"తన దినచర్యలో
ఏది లోపించింది?"

# మాదాకబళం, తల్లీ!

తొలికోడి కూసిన కొంతసేపటికి మలికోడి కూసింది. సుబ్బరామయ్య పక్కమీద లేచి కూర్చుని తనకు కంఠతా వచ్చిన పద్యాలు, శ్లోకాలు చదవడం మొదలుపెట్టాడు. వార్ధక్యం వల్ల గొంతుక వణికినా, ఊపిరి తిన్నగా అందక స్వరం ఎగుడు దిగుడైనా జీరపోవని కంఠం సుబ్బరామయ్యది.

అతని చిన్నతనంలో ఉత్సవాలు, జాతరలు జరిగే సమయాలలో గ్రామంలోని కుర్రకారంతా నాటకాలు ఆడేవారు. బుర్రకథలు చెప్పేవారు. అందులో సుబ్బరామయ్య పద్యంకాని, పాటకాని అందుకొంటే, గ్రామం ఈ కొసనుండి ఆ కొసవరకు అతని కంఠం ఖంగున మోగవలసిందే. వయస్సు మళ్లినా, నేటికీ సాధకం వల్ల అది పూర్తిగా సన్నగిల్లిపోలేదు.

అతని పద్యపఠనం పూర్తి అయ్యే సమయానికి ఇత్తడి చెంబు నీళ్లలో వేపపుల్ల నానవేసి, పక్కన తెచ్చిపెట్టింది కోడలు. "మామయ్యా! ముఖం కడుక్కొస్తే... పాలు పొంగుతున్నాయి" అన్నాది.

నోట పట్టిన వేపచేదు తియ్య తియ్యని, వేడి వేడి ఆవు పాలతో కడుక్కుపోయింది. వంకెన తగిలించి ఉన్న ఓణీ భుజం మీద వేసుకొని, చెప్పులలో కాళ్లు దూర్చి, తలుపు వారనున్న పొన్ను కర్ర చేతబట్టుకొని పొలానికి బయలుదేరాడు సుబ్బరామయ్య.

నిజానికి అతను అంత ఉదయాన్నే పొలానికి వెళ్లి చేయవలసిన పనిలేదు. పదేళ్ల కిందటనే పెద్ద కొడుకు పొలంపని అందుకొన్నాడు. నమ్మకస్తులైన పాలేర్ల సహాయంతో అతడు పని అంతా జాగ్రత్తగా చక్కపెట్టుకొంటున్నాడు.

పొలం గట్లంట పంటలను చూస్తూ, కాస్తసేపు అటు ఇటు తిరుగుతూ కాలక్షేపం చేసాడు సుబ్బరామయ్య. పంటల బాగోగుల గురించి రైతులతో చర్చించాడు. గవర్నమెంటు పన్ను కట్టవలసిన సమయం దగ్గరవుతున్నాదని కొడుకును హెచ్చరించాడు. తిరిగి వెళ్లిపోతూ కూరల పెరట్లో కాచిన వంగపిందెలు, దోసకాయలు కోసుకొని చేతి సంచిలో వేసుకొని ఇంటికి బయలుదేరాడు.

రచ్చబండ దగ్గరికి చేరేసరికి ఎండ కరకరా పొడుచుకువచ్చింది. ఆ మాటా, ఈ మాటా అనుకొనేందుకు గ్రామస్థులు నలుగురు చేరే ప్రదేశం అది. కాస్తసేపు అక్కడ ఆగి వాళ్లతో నాలుగు కబుర్లు చెప్పుకొని, సేదతీరాక లేచి ఇంటివైపు నడక సాగించాడు.

ఇంటిముందు కొబ్బరి మట్టలతో ఎండ గాడ్పు కొట్టకుండా వేసిన పందిరి కింద మనమలతో కాస్త ఆటలాడి అలసిపోయేసరికి, భోజనానికి పిలుపు వచ్చింది. అన్నపూర్ణ వంటి సత్తెమ్మ చేతి భోజనం గడ్డపెరుగుతో పూర్తిచేసి లేచేసరికి కంటిమీద కునుకు వచ్చింది.

పడమరనుంచి ఎండ ముఖం మీద పడుతూంటే లేచి కూర్చున్నాడు. ఊరవేసిన ఉసిరికాయలు, ఉప్పు కారం చల్లిన దోసబద్దలు. కంచుగ్లాసుతో మజ్జిగతేట తెచ్చి, దగ్గర పెట్టింది కూతురు. ఇంట్లో అంతా కాఫీలు తాగడం మొదలు పెట్టి చాలాకాలం అయినా సుబ్బరామయ్య అప్పటివరకు దాని వాసనకూడా చూడలేదు.

"మనిషన్న తరువాత తిండి, నిద్రలలోనూ, పని పాటలలోనూ ఒక అలవాటంటూ ఉండాలి. ఏది పడితే అది తింటూ, ఎప్పుడు వీలైతే అప్పుడు నిద్రపోతూ ఉంటే, ఈ వయస్సులో నేను ఇలాగ ఉండేవాడినా? ఈనాడు మీకు రానీండి, ఎలా వాలిపోతారో చూద్దురుగాని" అని పిల్లల్ని ఆక్షేపించేవాడు.

ఎండ చల్లబడ్డాక అలా ఏటిదాకా పోయి, తోవలో కనిపించిన వాళ్లతో ఇంటి భోగట్టాలు, ఊరి భోగట్టాలు, పలకరించి మాట్లాడి, దీపాలు పెట్టేవేళకు ఇంటికి తిరిగి వచ్చాడు. గ్రామాల్లో 'గూట్లో దివ్వె, నోట్లో బువ్వ' అన్నట్లు – చీకటి పడగానే, పొలం నుంచి అలసివచ్చిన రైతులు అలసట తీరేలా ఒంటిమీద వేడి నీళ్లు పోసుకొని, ఇంత తిండితిని పడుకొంటారు.

ఉడుకునీళ్లు పోసుకొని తండ్రి కొడుకులు వచ్చేసరికి విస్తళ్లలో భోజనం సిద్ధంగా వుంది. పంటలు, పనులు గురించి, కార్యాలు, కథలు గురించి మాట్లాడుకొంటూ భోజనాలు పూర్తిచేశారు.

కోడలు హరికేన్ లాంతరు, రామాయణ పుస్తకం తెచ్చి మామగారి ముందు పెట్టింది. సుబ్బరామయ్య రామాయణ పఠనం మొదలుపెట్టేసరికి ఇంటిలోని వారు ఒక్కొక్కరు వచ్చి కూర్చున్నారు. ఒక గంటపైగా పురాణ కాలక్షేపం అయ్యేక, "ఇంక నే పడుకొంటాను" అంటూ గదిలోకి వెళ్లిపోయాడు అతడు.

అది రోజూ అతడు చెప్పే ఆఖరి మాట. వరసగా నాలుగు రోజులు సుబ్బరామయ్యను దగ్గరగా ఉండి చూసినవాళ్లు అతడు ఏ సమయంలో ఏ మాట అంటాడో సులువుగా చెప్పగలుగుతారు. అతడి మాటలు, చేతలు అలవాటుపడిన గాడిలో నడుస్తున్న బండిలా అతని ప్రమేయం లేకనే జరిగిపోతాయి.

రామాయణ పుస్తకం మూసి సుబ్బరామయ్య గదిలో పక్క మీదికి చేరితే మరునాటి కోడికూత చెవులబడగానే తెలివి రావలసిందే.

విశాలమైన టేకు కర్ర పందిరి మంచం, దోమతెర, దాని మీద బూరుగ దూది పరుపు, తలవైపు మెత్తని ఎత్తైన రెండు తలగడలు, కాళ్ల వైపు వెచ్చని ఉన్ని శాలువ – ఇదీ అతని

పడక. ఇంట్లో మిగిలినవాళ్లు ఎలా సర్దుకొన్నా అతని పడకమాత్రం మారదు. మారితే అతనికి నిద్ర రాదు. దోమతెర సరిచేసుకొని, తలగడపై తల ఆన్చిన అయిదు నిమిషాల్లో ఆ గది సుబ్బరామయ్య గుర్రుతో నిండిపోతుంది.

“మరీ ఇంత విపరీత మేమిటమ్మా! ఇలా కళ్లు మూసారో లేదో” అని విసుక్కొంటుంది నిద్ర తిన్నగా పట్టని రోజున భార్య సత్తెమ్మ.

అటువంటి సుఖనిద్ర ఆ రోజు ఏ కారణంగానో సుబ్బరామయ్య దరిదాపుల్లో రాలేదు. ఎంత ఆలోచించినా కారణం తెలిసి రాలేదు. “ఆరోజు దినచర్యలో ఏమైనా తేడా వచ్చిందా? అనరాని మాట అనడం కాని, తినకూడని పదార్థం తినడం కాని జరిగిందా?” అని తెల్లవారుఝామున లేచిన దగ్గరినుంచీ జరిగిన కార్యక్రమం గుర్తుకు తెచ్చుకొన్నాడు. ఎక్కడా ఏ లొసుగూ ఉన్నట్లు తోచలేదు.

పక్క నవారు మంచం మీద తల కింద పాత చీర పెట్టుకొని సత్తెమ్మ హాయిగా నిద్రపోతున్నాది. సంధ్య పడుతుంటే ఇంటికి వచ్చిన చుట్టాలకు తన జంబుకానా తలగడ ఇచ్చి తను ఖాళీ మంచం మీద పడుకొన్నాది. అయినా నిద్ర ఆమెను ఆదరించి ఆలింగనం చేసుకొంది, సాఫీగా తీస్తున్న ఆమె ఊపిరి సుబ్బరామయ్యను ఊదర కొట్టింది. ‘పక్కమారినా, చోటుమారినా దీని నిద్ర కేం భంగం ఉండదు. నిద్రాదేవి దీని రెప్పలమీద నాట్యం చేస్తుంది’ అని భార్యను చూసి అసూయపడ్డాడు.

అతని అసూయను చూసి నిద్రాదేవి పకపక నవ్వింది. ‘నన్ను పట్టుకో చూద్దాం’ అన్నట్లు కవ్వించి మరి కాస్త దూరంగా పోయింది.

సుబ్బరామయ్య పంతంతో నిద్రను పట్టుకోవాలని ప్రయత్నం చేశాడు. పక్కపై నుండి దిగి దుప్పటి సరిగా దులిపి మడతలు లేకుండా పరుచుకొన్నాడు. తలగడలు ఇటు నుండి అటు మార్చుకొన్నాడు. పక్కమీద వెల్లకిలా పడుకొని, దోమ తెరలోంచి లీలగా కన్పిస్తున్న ఏనాడో తను కట్టిన ఇంటి వాసాలను లెక్కపెట్టడం కిట్టుబాటు కాలేదు. కంటిమీద రెప్ప వాలలేదు.

తల అటునుండి ఇటు మారడంతో ఆకాశంపై నక్షత్రాలు గుత్తులు గుత్తులుగా కనిపించాయి. దక్షిణ తెరిపి గాలి సన్నగా సాగింది. పెరటిలో విరబూచిన పున్నాగ వాసనలు గుబాళించింది. దూరంగా బావురు కప్పల అరుపు. పక్క పెరట్లో కీచురాళ్ల రొద.

చంటిదానికి మెల్లిగా జోలపాడుతున్న కూతురు కంఠం నిద్రమత్తులో తూగుతూ, జోగుతూ కొద్ది కొద్దిగా వినిపించి పూర్తిగా ఆగిపోయింది. పెద్ద కొడుకు గదిలోంచి అంత వరకు మెల్లిగా వినిపిస్తున్న సంభాషణలు మరునాటి రాత్రికి వాయిదాపడ్డాయి.

అందరూ మెల్లి మెల్లిగా నిద్రా జగత్తులోకి జారిపోతున్నారు. జాగృత జగతిమీద తెరదించబడుతున్నాది. దివారాత్రుల నాటకంలో మొదటి రంగం పూర్తి అయింది. అందరూ తమ వేషాలను రెండవ రంగానికి అనువుగా మార్చుకొంటున్నారు. ‘తను ఒక్కడే వెర్రి

వెంగళాయిలా మొదటి రంగంలో వేదికమీద అకారణంగా నిలిచిపోయాడు' అనుకొన్నాడు సుబ్బరామయ్య.

పెరటివైపు పాకలో పాలేరు సుబ్బిగాడు "హరిహరీ నారాయణ" పదంలో ఆఖరి ముక్క అంటూ "హోయ్" అని ఆవలించాడు. "తొంగుందాం, మావా! నిద్దరొత్తున్నాది" అన్నాది వాడి పెళ్లాం రంగి.

అవునవును. అందరికీ నిద్ర ప్రత్యక్షమవుతున్నాది. అందరిని అనునయంగా దగ్గరికి తీసుకొంటున్నాది. తనను మాత్రం.. వెలివేసినట్లు...

'రోజూ నిన్నుమాత్రం లాలించలేదూ? పిలవగానే పలకలేదూ అన్నది అతని మనస్సు.

'అయితే ఈ రోజెందుకు ఇలా జరిగింది?' మొదటి ప్రశ్న చుట్టు తిరిగి ముందుకు వచ్చి నిలిచింది. అంతలో ఏదో గుర్తుకు వచ్చింది అతనికి. మంచం మీదనుంచి ఒక్క ఉదుటున లేచి సత్తెమ్మను కుదిపి లేపాడు. మంచి నిద్రతో ఉన్న సత్తెమ్మ కళ్లు నులుపుకొంటూ లేచి, ఎదురుగా భర్తను చూసి ఏదో ముంచుకు వచ్చి ఉంటుందన్న భయంతో 'కెవ్వున' కేక వేయబోయింది.

"ఏమిటే ఈ సంత!" సుబ్బరామయ్య భార్యపై విసుక్కొన్నాడు.

"మీరు.... మీరు ఎందుకు.... ఎలా లేచారు?" సగం సగం మాటలు మింగేస్తూ అడిగింది సత్తెమ్మ.

"లేవడం లేదూ.... పాడూ లేదు. ఇంకా నిద్రపోలేదు" అన్నాడు సుబ్బరామయ్య తన అసహనాన్ని కనబరుస్తూ.

"ఇంకా మీరు నిద్రపోలేదూ!" ఆశ్చర్యంతో నోరు అంత చేసుకొని అడిగింది సత్తెమ్మ.

"ఇదంతా నీ మూలంగానే.... నీ పుట్టింటివంక చుట్టాలు వచ్చారని ఆసందట్లోపడి, భోజనం అయ్యాక నాకు పాలు ఇవ్వడం మరిచిపోయావు. అలవాటంటే అలవాటే. పాలు తాగందే నిద్ర రమ్మంటే ఎలా వస్తుంది? నిద్రవేళ తప్పి నే తన్నుకు చస్తుంటే హాయిగా నిద్రపోయావు" భార్యను నిందించాడు.

"అయ్యో రామ! అవేం మాటలండీ! మీరు రామాయణం చదువుతుంటే అమ్మాయి పాలు తెచ్చి ఇయ్యలా? కమ్మగా పాలు తాగి, తాంబూలం వేసుకొని నిద్రపోతానని గదిలో దూరేరాయె! మీరిలా జాగారం చేస్తున్నారని నాకేం తెలుసు? నే వచ్చేసరికి కళ్లు మూసుకొనే ఉంటిరాయె కావాలంటే మరి కాస్త పాలు తెస్తాను. తాగి నిద్రపోండి" అంటూ లేవబోయింది సత్తెమ్మ.

"అహ! తాగితే మరెందుకు? మరిచిపోయి పాలుగాని తాగలేదేమో, అందుకే నిద్ర రాలేదేమో అనుకొన్నాను సరిలే. నువ్వు పడుకో" అంటూ తన మంచంమీదికి చేరుకొన్నాడు.

సత్తెమ్మ అటు తిరిగి పడుకొంది. సుబ్బరామయ్య మంచంమీద రోడ్డు రోలరులా దొర్లుతున్నాడు. ఎక్కడినుండో ఒక దోమ వచ్చి తెరలో మెల్లగా దూరి సుబ్బరామయ్యకు

జోలపాడడం మొదలుపెట్టింది. 'అసలే నిద్రరాక నే చస్తుంటే ఇదొకనటి నా ప్రాణం మీదికి' అని దోమను కసురుకొంటూ లేచి కూర్చున్నాడు. ఇక్కడ అక్కడ వాలి, చివరికి సుబ్బరామయ్య చేతిలో ప్రాణం విడిచింది దోమ.

దోమ సంహారం పూర్తి అయేక తిరిగి సరిగా సర్దుకొని నిద్రకు ప్రయత్నం చేసాడు సుబ్బరామయ్య. 'ఆలోచిస్తూ పడుకొంటే నిద్ర దానంతట అదే వస్తుంది' అనుకొన్నాడు.

ఆ ఏడు పెద్దమడిలో రాలే ధాన్యం అంచనా వేశాడు. సంవత్సరం పొడుగునా పంటలకు ఎంత మదుపు పెట్టింది జ్ఞాపకం చేసుకొన్నాడు. వడ్డీలమీద తిరుగుతున్న సొమ్ము ఎవరెవరి దగ్గర ఎంత ఉందో, అది ఎప్పట్లో ఎలా వసూలు చెయ్యచ్చో ఆలోచించాడు. కొట్టంలో పెరుగుతున్న కోడె దూడ ఎప్పటికి పొలం పనికి పనికి వస్తుందో అంచనా వేశాడు.

అయినా నిద్ర ముంచుకు రాలేదు. సరి కదా మెల్లిగా తొంగి చూసిన పాపాన కూడా పోలేదు.

'మనసులో కల్మషం, మనిషికి బాధలు ఉంటే తిన్నగా నిద్రపట్టదు అనేవాడు తాతయ్య. నాకేం బాధలున్నాయి? నేనేం పాపాలు చేశాను?' అని తరిచి చూసుకొన్నాడు సుబ్బరామయ్య.

చీకూ, చింతాలేని సుబ్బరామయ్య తన జీవితం అంతా గాలించినా, బాధలేమీ చూడలేకపోయాడు. అతడికి ఆరుగురు పిల్లలు. మగ పిల్లలు ముగ్గురికి పెళ్లిళ్లు అయిపోయాయి. పెద్దకొడుకు, చిన్నవాడు వ్యవసాయం చేస్తున్నారు. మధ్యవాడు కాలేజీ చదువులు చదివి పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆడపిల్లలిద్దరికి తగినచోట కట్నం కానుకలతో వివాహాలు చేశాడు. మూడవ పిల్లకు మేనరికం సిద్ధంగా వుంది. ఆ ఏడో, మరుసటి ఏడో ఆ శుభకార్యం జరిగిపోతుంది. అతని ఇంట కాలుపెట్టిన కోడళ్లు అతి ఉత్తమురాళ్లు. అత్త అన్నా, మామ అన్నా అభిమానంతో వినయ విధేయతలతో మసులుకొంటారు. ఇంతక అతనికేం బాధలు ఉన్నాయి?

భార్య సత్తెమ్మను గురించి ఈనాడూ ఏనాడూ కూడా ఒక్క మాట తప్పుగా అనుకొందుకు వీలులేదు. ఒకరి జోలి, శొంఠి అక్కరలేని అమాయకురాలు. తనేమో, తన పనేమో ఇది కావాలి, అది కావాలి అని భర్తను వేధించుకు తినే రకం కాదు.

సుబ్బరామయ్య స్వతహాగా నెమ్మదస్తుడు. జాలిగుండె కలవాడు. ఒకరికి తెలిసి తెలిసి చేసిన హానీ, అపకారం లేదు. అతని మనస్సును పిండి, నిద్రను పాడుచెయ్యగలిగినంతటి అక్రమాలు అతను చేసినవి లేవు.

'మరి ఈ రాత్రి శనిలా నా నెత్తెక్కి ఇలా నాట్యం చేస్తున్నాడెందుకు?' అనుకొన్నాడు సుబ్బరామయ్య. దూరంగా ఎక్కడో అతనిలాగే నిద్రపట్టని కాకి 'కావ్'మన్నాది. అప్పుడే తెల్లవారిపోతున్నదా? ఈ రాత్రంతా జాగరణతో ఇలాగే గడిచిపోయిందా? అనుకొన్నాడు. పక్కపై అటునుంచి ఇటు తిరిగి ఆకాశంవంక చూశాడు. చీకటి చీల్చుకొని వెలుగువస్తున్నాది.

కాని అది పగటి వెలుగు కాదు, వెన్నెల. అప్పుడే చంద్రోదయం అవుతున్నాది. 'అయ్యో! ఇంతేనా టైం అయింది?' అనుకొన్నాడు.

అతడు పడక గదిలో కాలుపెట్టి గంటకన్నా ఎక్కువ కాలేదని తెలియజేస్తూ సావిట్లో గడియారం గంటలు కొట్టింది. సుబ్బరామయ్య గుండె అదిరిపోయింది. ఒక్క గంటలోనే తను ఇంత యాతన అనుభవిస్తే, ఈ రాత్రంతా నిద్రలేకుండా ఎలా గడపడం? దీనికి కారణం ఏమిటి? 'ఛీ... ఛీ... పాడు. మళ్లా మొదటికే వచ్చాను' అని విసుక్కొన్నాడు.

అసలు సకాలంలో నిద్ర రాకపోయేందుకు కారణాలు ఉంటాయా? ఏవో ఉన్నట్లే అనిపించింది అతనికి. అవిచ్ఛిన్నంగా సంవత్సరాల తరబడి అలవాట్ల బండిమీద ప్రయాణం సాగిస్తున్న సుబ్బరామయ్య బాటకు అడ్డంగా ఏదో నిలిచింది. ఆ అడ్డంకి ఏమిటో అతనికి అవగతం కాలేదు. తెలిస్తే భూమిని తలకిందులు చేసి అయినా దానిని తొలగించేవాడు.

మళ్లా ఏవో ఆలోచనలు అతని తలలో ముసురుతున్నాయి. 'హాయిగా పట్నంలో అయితే రాత్రిపూట సినీమాలూ అవీ ఉంటాయి. ఇలా పక్కమీద దొర్లనక్కరలేకుండా కాలక్షేపానికి ఇంకా అనేక వినోద కార్యక్రమాలు ఉంటాయి. ఈ దిక్కుమాలిన గ్రామంలో సాయంత్రం ఎనిమిది గంటలకే ఊరు మాటు మణిగిపోతుంది. ఎదటి వాడి బాధ ఎవరికి కావాలి? హాయిగా నిద్రపోతారు' ఏనాడూ కలగని ఆలోచన అతడి మదిలోకి రప్పించిన ఆ రాత్రి చాలా గొప్పదనే చెప్పాలి. తన గ్రామం బాగా లేదనుకోడం కాని, పట్నాల్లో మనుష్యులు ఏదో జుర్రుకొంటున్నారని కాని సుబ్బరామయ్య ఏనాడూ అనుకోలేదు.

అతనింకా పక్కమీద ఇటూ అటూ దొర్లుతూనే వున్నాడు. ఈ రాత్రి తనను ఎందుకిలా పరిహసిస్తున్నాది? తన దినచర్యలో ఏది లోపించింది? అని ప్రశ్నించుకొంటూనే వున్నాడు. సరిగ్గా ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ ఆ వీధి చివర నుంచి అతడికి వినబడింది.

"మాదా కబళం తల్లీ! పట్టెడన్నం పెట్టించమ్మా" అంటూ. అది రోజూ అరిచే కంఠం. మొదట దూరంగా, రాను రాను దగ్గరగా అదే ఆక్రోశం. ఆ బిచ్చగాడి కంఠంలో మాధుర్యం లేదు. దైన్యం, జాలి, నిస్పృహనిండి వున్నాయి. కాని సుబ్బరామయ్య జాగ్రదవస్థ లోంచి సుషుప్తవ్యవస్థలోకి జారుకొనేముందు ఎంత కాలంగానో వింటున్న జోలపాట అది. ఏ కారణం చేతో ప్రతిరోజూ ఒకే వేళకు వినిపించే ఆ జోలపాట ఆనాడు మాత్రం గంట ఆలస్యంగా సుబ్బరామయ్య కర్ణపుటాలు తాకింది.